క్లుప్తంగా

దాతల సహకారం ఎనలేనిది

గోపాలపురం: గ్రామాల అభివృద్ధిలో దాతల సహకారం ఎనలేనిదని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. రాజంపాలెంలో అవంతి ఫీడ్స్ సంస్థ ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. అవంతి ఫీడ్స్ సంస్థ సేవలను ఆయన అభినందించారు. సర్పంచ్ కురుకూరి ధనలక్ష్మి, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ కాకులపాటి లలిత, కురుకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం



కోరుపల్లి- పెండ్యాల రోడ్డు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుపల్లి–పెండ్యాల ప్రధాన రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కోరుపల్లి సిలువ సెంటర్ నుంచి పెండ్యాల వరకు 2.1 కిలోమీటర్ల బీటీ రోడ్డును రూ.92 లక్షలతో నిర్మిస్తున్నట్లు పీఆర్ స్పెషల్ ఏఈ ఎం.ఆల్‌స్టిన్ శుక్రవారం తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ నాయకులు మట్టా వెంకటేశ్వరరావు, గాజుల పాటి సత్యనారాయణ, బొర్రా నాగవెంకట ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు మంజూరు చేయించారని వివరించారు.

ఓటర్ల నమోదు సర్వే పరిశీలన



తాళ్లపూడిలో ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న ఏఎస్‌వో వెంకటేశ్వరరావు

కొవ్వూరు: ఓటర్ల జాబితా సవరణలో భాగంగా బీఎల్‌వోలు చేపట్టిన ఇంటింటా సర్వేను తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ శుక్రవారం పరిశీలించారు. సీతంపేట, మద్దూరు లంక, బంగారమ్మపేట, వాడపల్లి గ్రామాల్లో ఆయన సందర్శించి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి ప్రజలు తమ వంతు సహకరించాలని కోరారు.

తాళ్లపూడి: మండలంలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిని తాళ్లపూడిలో ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు పరిశీలించారు. తహసీల్దార్ టి.రాధిక ఆదేశాల మేరకు గ్రామాల్లో ముమ్మరంగా ఓటర్ల సర్వే జరుగుతుందన్నారు.

చాగల్లు: ఓటర్ల నమోదు సర్వేను బాధ్యతగా చేపట్టాలని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి అన్నారు. స్థానికంగా బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. రాజంపాలెం సచివాలయం వద్ద సర్పంచ్ కురుకూరి ధనలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఇందులో సుమారు 150 అర్జీలకు గానూ 90 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి ఆయా లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. నివాస, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, కౌలురైతు కార్డులను ఎమ్మెల్యే వెంకట్రావు పంపిణీ చేశారు. రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, ఎంపీటీసీ సభ్యురాలు గెడ అనంతలక్ష్మి, నాయకులు పోతిరెడ్డి నాగరాజు, వుండవల్లి సూర్యచంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చాదరాశిగుంటలో..

నల్లజర్ల: చాదరాశిగుంట సచివాలయం వద్ద సర్పంచ్ నాయుడు నాగసాయి జ్యోతి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష గ్రామసభకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుమారు 1,372 మందికి వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. తమకు అనుమునులంకలో ఇళ్ల స్థలాలు ఇచ్చారని, సొంతూరు చాదరాశిగుంటలో స్థలాలు ఇవ్వాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాయుడు రామకృష్ణ, నాయకులు ఆలపాటి కరుణాకర్, దారం శ్రీనివాస్, నాయుడు శ్రీహరి, ఇమ్మణ్ణి సోమరాజు, మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా



రాజంపాలెంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

అర్హులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. చిన్నాయగూడెం సచివాలయం–1 వద్ద సర్పంచ్ డి.జ్యోతిరాణి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకూ 45 సచివాలయాల పరిధిలో 40 వేల వినతులు వచ్చాయని, ఇందులో 32 వేల వినతులు పరిష్కరించామన్నారు. చిన్నాయగూడెం సచివాలయం–1 పరిధిలో 1,164 వినతులు రాగా, 685 వినతులను పరిష్కరించినట్టు వివరించారు. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, జెడ్పీటీసీ పొట్టి స్వర్ణలత, ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైస్ ఎంపీపీలు కొర్లపాటి అరుణ, సాదే సుబ్బారావు, ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఆచంట అనసూయ, సొసైటీ అధ్యక్షులు గడా జగదీష్, పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: ఎం.నాగులపల్లిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సర్పంచ్ యంత్రపాటి సునీల్, వైఎస్ ఎంపీపీ ఓగిరాల చంద్ర తదితరులతో కలసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. బొండాడ వెంకన్నబాబు, నల్లూరి వెంకన్నబాబు, నల్లూరి బాపనయ్య తదితరులున్నారు.



వద్లూరులో ధ్రువపత్రాలు అందిస్తున్న సిద్ధార్థరాజు, సర్పంచ్ శ్రీనివాసు

ఉండ్రాజవరం: వేలివెన్ను–2, వద్లూరు గ్రామాల్లోని సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. వేలివెన్నులో 750 మందికి జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, వద్లూరులో 1,617 మందికి మండల జేసీఎస్ కన్వీనర్ కఠారి సిద్ధార్థ రాజు, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ శ్రీనివాసు చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణం రాజు, తహసీల్దార్ జి.కనకరాజు, ఎంపీటీసీ సభ్యుడు వేండ్ర రమేష్ పాల్గొన్నారు.

పెరవలి: మల్లేశ్వరం, కొత్తపల్లి అగ్రహారం గ్రామాల్లో జగనన్న సురక్ష సభలు జరిగాయి. మల్లేశ్వరంలో 1,115, కొత్తపల్లి అగ్రహారంలో 1,165 మందికి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ధ్రువీకరణ పత్రాలు అందించారు. తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఎంపీడీఓ దామోదరరావు, మండల పార్టీ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, సర్పంచ్ బొలిశెట్టి రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ వసంతం

- ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు
- నిడదవోలులో గడప గడపకూ..

నిడదవోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. స్థానిక మున్సిపాలిటీలోని 13, 14 వార్డుల్లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా రాష్ట్ర సంపదను చంద్రబాబు దోచుకున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు, అతని దత్తపుత్రుడు కలిసి నీచమైన వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం అర్హులందరికీ పథకాలు చేరాలనే లక్ష్యంతో గడప గడపకూ వస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్మన్లు యలగాడ బాలరాజు, గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు బిర్రె పార్వతి, కామిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

వరద ఉధృతితో అప్రమత్తం

కొవ్వూరు: గోదావరిలో వరద నీటి ప్రవాహం పెరిగింది. కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో స్నానఘట్టంతో పాటు పిండ ప్రదానాల రేవును వరదనీరు ముంచెత్తింది. క్షేత్రంలో ఒడ్డును తాకుతూ నీరు ప్రవహిస్తుంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరువలో నీరు ఉండడంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. ఎగువన నీటి మట్టాలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో మద్దూరులంక సమీపంలో నది గర్భంలో నివాసం ఉంటున్న పల్లెపాలెం వాసుల తరలింపునకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తెలిపారు. నీటిమట్టం పెరుగుతున్న దృష్ట్యా సురక్షిత ప్రాంతానికి తరలిరావాలని ఆయన సూచించారు. వీఆర్వోలు, ఇతర రెవెన్యూ సిబ్బంది అక్కడి వాసుల వివరాలు నమోదు చేస్తున్నారు. గోదావరి లంకల్లో పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పశు సంవర్ధక శాఖ ఏడీ వెంకటరెడ్డి సూచించారు.



కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

తాళ్లపూడి: గోదావరిలో వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఎవరూ వేటకు వెళ్లవద్దని తహసీల్దార్ టి.రాధిక అన్నారు. తాళ్లపూడి మండలంలోని గోదావరి రేవులను ఆమె పరిశీలించారు. రేవుల వద్ద పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. చిన్నాయగూడెంలో రూ.78 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. గ్రామ శివారున చెరువు వద్ద ఎంపీ నిధులు రూ.5 లక్షలతో మల్టీపర్పస్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి రూ.1.56 కోట్లు మంజూరు చేశామన్నారు. రూ.5 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల నిర్మిస్తున్నట్లు చెప్పారు. చిన్నాయగూడెం- కుంతలగూడెం రోడ్డు అభివృద్ధికి మార్కెట్ కమిటీ నిధులు రూ.1.45 కోట్లు కేటాయించారన్నారు. యర్నగూడెం



వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

– పొంగుటూరు ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి రూ.18.50 కోట్లు, దూబచర్ల– ద్వారకాతిరుమల రహదారి నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరైనట్లు వివరించారు. ఈ రెండు రహదారులను జర్మన్ టెక్నాలజీతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఏలూరు–గుండుగొలను–కొవ్వూరు (ఈజీకే) నుంచి లక్ష్మీపురం, పల్లంట్ల, కురుకూరు మీదుగా నిడదవోలు అడ్డరోడ్డు వరకూ రహదారి, తాజంపూడి నుంచి యర్నగూడెం వరకు రెండు కిలో మీటర్ల రహదారికి రూ.30 కోట్లు మంజూరైనట్లు వివరించారు. సర్పంచ్ డి.జ్యోతిరాణి, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ పొట్టి స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, సొసైటీ అధ్యక్షుడు గడా జగదీష్, వైఎస్సార్ సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గడా రాంబాబు, చవల సూర్యచంద్రరావు, గారపాటి రమాప్రభ, కూచిపూడి సతీష్ పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలో రైతులకు ఎల్‌బీజీ–52 రకం కంది విత్తనాలు అందించినట్లు మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. చాదరాశిగుంటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు రైతులకు విత్తనాలు అందజేశారన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి

నిడదవోలు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులు, వాటి నివారణ చర్యలపై శానిటరీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రబలే వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు పారిశుద్ధ్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ పద్మావతి

రికవరీ సొమ్ము అందజేత

నిడదవోలు రూరల్: సింగవరంలో డ్వాక్రా సంఘాల సభ్యులు నిడదవోలు ఇండియన్ బ్యాంక్‌లో బ్యాంక్ లింకేజీ రుణాలు తీసుకున్నారు. ఆ సొమ్ము తిరిగి బ్యాంక్‌కు చెల్లించకుండా వీఓఏ చాలనాటి లలిత దుర్వినియోగం చేయగా, ఆమె నుంచి రూ.21.70 లక్షల నగదు రికవరీ చేసినట్లు ఏపీఎం ఇ.శ్యామ్‌సుందర్ శుక్రవారం తెలిపారు. సింగవరం గ్రామ సంఘం పరిధిలో 45 గ్రూపులుండగా, సుమారు 446 మంది సభ్యులకు చెందిన రుణాలను బ్యాంక్‌లకు చెల్లించకుండా లలిత వాడుకున్నట్లు 6న డీఆర్‌డీఏ అధికారుల బృందం గుర్తించిందన్నారు. వీఓఏ నుంచి రికవరీ చేసిన రూ.21.70 లక్షల సొమ్మును సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స చందు ఆధ్వర్యంలో డ్వాక్రా సభ్యులకు పూర్తిగా అందజేశామన్నారు.



సింగవరంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు సొమ్ము అందజేస్తున్న పెన్మెత్స చందు

ఎస్.ముప్పవరంలో 'ఫ్యామిలీ డాక్టర్'

చాగల్లు: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వైద్య సేవలు అందిస్తున్నామని బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పీఆర్ఎల్ దేవి తెలిపారు. శుక్రవారం ఎస్.ముప్పవరంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 85 మందికి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు.

రాజ్యలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు

తాళ్లపూడి: అధిక శ్రావణ మాసం మొదటి శుక్రవారం కావడంతో తాళ్లపూడిలోని రాజ్యలక్ష్మీదేవి అమ్మవారి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. పురాణ ఉపన్యాసకుడు పరస రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ మాసంలో వచ్చే అన్ని శుక్రవారాలకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. స్థానిక నవదుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మ ఆలయంలో అర్చకుడు ప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



తాళ్లపూడిలో ప్రత్యేక అలంకరణలో రాజ్యలక్ష్మీదేవి

సంక్షిప్తంగా..

నేడు మండల పరిషత్ సమావేశం

దేవరపల్లి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు తెలిపారు. మండల పరిషత్తులో జరిగే ఈ సమావేశానికి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు 'జగనన్న సురక్ష' సభలు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం, తాళ్లపాలెం గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష సభలు జరుగుతాయని ఎంపీడీఓ పి.శామ్యేలు శుక్రవారం తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు జగనన్న సురక్ష సర్వేలో నమోదు చేసిన వినతులకు అధికారులు పరిష్కారం చూపుతారన్నారు.

రోగులకు వైద్య సేవలు

ఉండ్రాజవరం: స్థానిక పీహెచ్‌సీలో మూడో శుక్రవారం స్పెషలిస్ట్ వైద్యులు సేవలు అందించారు. స్త్రీల వైద్య నిపుణులు మృదుల, చెస్ట్ స్పెషలిస్ట్ మేరీ వసంతలు రోగులను పరీక్షించారు. పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శుక్రవారం పీహెచ్‌సీలో స్పెషలిస్ట్ వైద్య సేవలను అందిస్తున్నామన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం

గోపాలపురం: మండల మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యత్వాల నమోదు వేగవంతంగా జరుగుతున్నాయని సంస్థ గౌరవాధ్యక్షుడు జొన్నలగడ్డ రాంబాబు అన్నారు. శుక్రవారం గోపాలపురం పరిసర ప్రాంతాల్లో 150 మందికి సభ్యత్వ నమోదు చేశారు. ఇప్పటికే మండల మానవతా సంస్థ ద్వారా అనేక సేవలు చేపట్టినట్లు మండల అధ్యక్షుడు ముప్పన కృపావరప్రసాద్ చెప్పారు.

వీఆర్‌ఏల దీక్షలు

పెరవలి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెరవలి తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం వీఆర్‌ఏలు రిలే దీక్షలు ప్రారంభించారు. కాకరపర్తి సత్తిపండు, ఈర్లగడ్డ చిట్టిబాబు, రాచెర్ల విఠల్‌బాబు, గంటి దుర్గా, కర్రి సుధాదేవి పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

చాగల్లు: డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని ఓ వ్యక్తిని బెదిరించిన సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ తెలిపారు. చంద్రవరానికి చెందిన మద్దిపాటి శ్రీనివాసరావు ఇంటికి మే నెలలో హైదరాబాద్‌కు చెందిన పసుపులేటి సాయికృష్ణ యాదవ్, ఆర్.కుమార్, చావా రామచంద్రరంగారావులు మరణాయుధాలతో వచ్చి డబ్బులు డిమాండ్ చేశారు. శ్రీనివాసరావు డబ్బులు ఇవ్వకపోవడంతో వారు చంపడానికి ప్రయత్నించగా గ్రామస్తులు కాపాడారు. ఈ ఘటనపై శ్రీనివాసరావు కోర్టును ఆశ్రయించడంతో శుక్రవారం ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు

గోపాలపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గోపాలపురం–2 క్లస్టర్‌లో ఎస్సీ (పురుష), గోపాలపురం–3 క్లస్టర్‌లో ఎస్సీ (మహిళ), కొవ్వూరుపాడు క్లస్టర్ పరిధిలో ఎస్సీ (పురుష) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు

పెరవలి: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తెలిపారు. ఖండవల్లి బీసీ ఏరియాలో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవనానికి శుక్రవారం శంకుస్థాపన చేసారు. సీడీపీఓ శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ వనజాక్షి, నాయకులు కంద వెంకన్న, చిన్నబాబు, నాగు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

నిడదవోలు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక నాలుగో వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఆమె బాలింతలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు.

కేసును సుమోటోగా స్వీకరించడంపై హర్షం

కొవ్వూరు: మణిపూర్ సంఘటనపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు స్వీకరించడంపై మాల మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బొంతా శ్యాం రవిప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సంఘటన జరిగి అనేక రోజులవుతున్నా ప్రధాని మోదీ నోరు విప్పకపోవడం దుర్మార్గమన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారం చేయడంతో దేశ ప్రతిష్ఠకే భంగం వాటిల్లిందన్నారు.